# అంతరంగం

ప్రతాప రవిశంకర్

చుట్టూ కొండలు. కొండల మధ్య బంధించబడునా అనిపించింది. నన్ను—నాతో పాటు మరో అమ్మాయిని అక్కడ దింపేసి బస్సు చూస్తుండగానే కొండ ఎక్కి అవతలమైపుకు వెళ్ళిపోయింది. కొండమీది నుంచి కిందికి జారిన ఆదారి పెళ్లికూతురి మొగలిపూల జడలా వుంది.

నాగార్జున కొండ దగ్గర బస్సు దిగే సరికి ఉదయం ఎనిమిదిన్నరయ్యింది. నవంబర్ నెల ఎండ ఆ వేళప్పుడు అంత చురుగ్గాలేదు. ఏదో అనారోగ్యంతో బాధ పడుతున్నట్టు సూర్యుడు బద్ధకంగా వెలుతున్నాడు.

తిరిగి చూస్తే ఆ అమ్మాయి వెనుకే వుంది. నవ్వుతోంది.

'మీ వెనుకే మరో ప్రాణి ఇక్కడ బస్సు దిగినట్టు మీరు గమనించినట్లు లేరే మహానుభావా' అన్నది.

ఆ అమ్మాయి చొరవకు నాకు ఆశ్చర్యం వేసింది. ఆ అమ్మాయి ఎవరో నాకు తెలియదు. కనీసం ఇంతకు ముందు చూసిన గుర్తులేదు.



'అసలు మిమ్మల్ని ప్రాజెక్ట్ హౌస్ దగ్గరే పలకరిద్దా మనుకున్నాను' అన్నది పద్మ.

'నేను మీకు తెలుసా'?

'ఆ— అలాగే అనిపిస్తోంది. కానీ ఎక్కడ చూశానో, ఎప్పుడు చూశానో గుర్తుకొచ్చి చావడం లేదు. ఒక్క నిముషం ఆగండి చెబుతాను''.

సరదా మనిషి. కొత్త అనే బెరుకులేదు.

''గుర్తుకొచ్చింది. మీరు మధుసూదన్ ఫ్రెండ్ కదూ?''.

'అవును. వాడు మీకు తెలుసా?'.

'భలేవారే' అతను బతికి వున్నట్లయితే నాకొంగునే ముడివేసి ఇక్కడకు తీసుకు వచ్చేదాన్ని'.

'అంటే'?

'ఇంకా అర్థం కాలేదా? మీరేం మగవాళ్లండీ' మేమిద్దరం ప్రేమికులం బాబూ'.

'మైగాడ్! ఐతే మీరు పద్మ కదూ?'

'మీకెలా తెల్సు?' ఆశ్చర్యంతో నోరంతా తెర చింది.

'వాడు మీ గురించి ప్రతి ఉత్తరంలో రాసేవాడు.



దేవుడు దయలేని వాడు. అప్పుడే వాడ్ని తన ఒళ్లోకి లాక్కుపోయాడు. నేనో మంచి స్నేహితుడుని కోల్పోయాను' బాధగా అన్నాడు.

'నాకు చీకటినే మిగిల్చి వెళ్లిపోయాడు. మధుసూదన్ లాంటి మనిషి మొగుడుగా దొరుకుతుంటే నేనెంతగా పొంగిపోయి వుంటాను'?

'నిజంగా ఆ వార్త విన్నప్పుడు నా గుండె పగిలి పోయింది. నిలువునా కృంగిపోయాను. మీకు గుర్తుందా? అతను ఏడాది క్రితం సరిగ్గా ఈ రోజునే పోయాడు' చెంత మామూలుగా చెబుదామని ప్రయత్నించినా పద్మ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

'బాధ పడకండి. అదో పీడకల. అందుకే ఇక్కడకు రావాలంటే నాకు బాధగా వుంటుంది. కాని రాక తప్పలేదు. ఆఫీసు పనిమీద ఈ నాగార్జున సాగర్‌కు వచ్చాను. వచ్చానుగదాని ఈ రోజువుండి నాగార్జున కొండ, మ్యూజియం చూసి పోదామనుకున్నాను. మీరు ఇక్కడకు ఎలా రాగలిగారు? ఇక్కడకు రావడం అంటే గతాన్ని తవ్వుకోటం తప్పించి ఏముంది?'

ఆమె వెంటనే ఇలా అన్నది.

'మీకు అలాగే అనిపిస్తుంది. నా సెంటిమెంట్ల గురించి మీకు తెలీదుకదా? చివరిసారిగా మధుసూదన్ ఇక్కడకు వచ్చినప్పుడే తన ప్రాణాలు పోగొట్టుకున్నాడు. సరిగ్గా ఇదే రోజు. కొంతమంది మనుషులు చనిపోయినా తమని గాఢంగా ప్రేమించిన మనుషులకు కనపడతారంటారు. మధుసూదన్ పట్ల నాకు వున్న ప్రేమ మీద నాకు కొండంత నమ్మకం వుంది. అందుకే మనసు నిలవక వచ్చాను. అయితే ఇంట్లో ఇక్కడకు వస్తున్నట్టుగా చెప్పలేదు. ఓ స్నేహితురాలి వూరు వెళుతున్నట్టుగా చెప్పి వచ్చాను. నాది గుడ్డి నమ్మకమే అనుకోండి. ఐనా ఇలా అనుకుంటే ఇదో శాటిస్‌ఫేక్షన్'.

నిజంగా విషాద సంఘటన. సరిగ్గా ఏడాది క్రితం విహారం కోసం మ్యూజియంకు మోటారు లాంచిలో వెళుతున్న మధుసూదన్ ప్రమాదవశాత్తు నీళ్లల్లో పడిపోయాడు. వెంటనే అతని శవం కూడా దొరక లేదు. నిజంగా ఆ షాక్‌ని పద్మ ఎలా తట్టుకుందో తట్టుకుంటే ఆశ్చర్యంగా వుంది.

మధుసూదన్ తనురాసే ప్రతి ఉత్తరంలో ఈ అమ్మాయి గురించే రాసేవాడు. ఆ అమ్మాయి మనస్తత్వం అంతా ఆ ఉత్తరాల నిండా వుండేది. ఇప్పుడే ఎదురుగా చూస్తున్నాను.

ఆమె భుజానికి లెదర్ బ్యాగ్ వేళ్లాడుతోంది. కృష్ణానది మీది నుంచి వస్తున్న చిరుగాలికి ఆమె ముంగురులు చిన్నగా కదులుతున్నాయి. ఓ మాదిరి పొడుగ్గా లావుగా వుంది. అందమైన రూపం. నిజంగా మధుసూదన్ దురదృష్టవంతుడే. అతడిని మించి ఈ అమ్మాయి పద్మ.

'ఇంతకీ నేను మధుసూదన్ స్నేహితుడినని ఎలా పోల్చుకోగలిగారు?' నాగార్జునుడి కాలంనాటి విశ్వవిద్యాలయం మిగిల్చిన అవశేషాలను చూస్తూ అడిగాను.

'వెరీ సింపుల్. మీరిద్దరూ కలిసి తీయించుకున్న ఫోటో అతని గదిలో గోడకు వుండేది. రోజూ చూసేదాన్ని.

'అలాగా' అన్నాను.

ఏవో చిన్న చిన్న గదులుగా ఆ కట్టడమంతా విభజించబడివుంది. చుట్టూ ఎత్తుగా పెరిగిన పూచిక మొక్కలు... ఇంకా ఏవో పేరు తెలియని వృక్షాలు. చుట్టూ ఇనుప తీగెలతో కంచె.

'ఇలాంటి పురాతన కట్టడాల మీద మీకు ఇంట్రెస్టు వుందా?' అడిగిందామె.

'నిజానికి లేదు. కానీ ఇంతవరకు వచ్చాము కాబట్టి చూడక తప్పదు. ఐనా ఇలాంటి వాటిని చూడటంలో ఓ విధమైన థ్రిల్ వుంటుంది'.

'ఏమో! మధుసూదన్ చావుకు ఇవన్నీ కూడా కారణాలేమోనని నాకు అనిపిస్తోంది. వీటిని చూడటం కోసమే మధుసూదన్ ఇక్కడకు వచ్చాడు. అతనికి ఇలాంటివి చూడటం ఎంతో ఇష్టం. అప్పుడు నేనూ అతనితో వచ్చేదాన్నే. కాని డిగ్రీ ఫైనలియర్ ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. లేకపోతే ఎలా వుండేదో?'.

అక్కడనుంచి వెళ్లి దగ్గర్లోనే వున్న ఆనాటి స్టేడియంని కూడా చూశాము. దానిమీదకు ఎక్కితే అంతా ఓ చిత్రంలా అగుపించింది.

టైము చూశాను, తొమ్మిదీ ఇరవై.

'ఇక వెళ్దామా... లాంచీ బయలుదేరే టైమయ్యింది' అన్నాను దిగుతూ—

'ఎన్ని గంటలకి'?

'తొమ్మిదిన్నరకు'

'పదండి ఐతే'

పద్మరాసుకున్న పౌడర్ వాసన వుండి వుండి నన్ను తాకుతోంది.

మేం నది ఒడ్డుకు వచ్చేసరికి లాంచీ బయల్దేరటానికి సిద్ధంగా వుంది. ఆమెక్కూడా నేనే టికెట్లు తీసుకున్నాను. అప్పటికే అక్కడకు రెండు టూరిస్టు బస్సుల్లో సికింద్రాబాద్ నుండి స్కూలు పిల్లలు వచ్చారు. ఇంకో బస్సు ఎవరిదో టూరిస్టులది.

అప్పటికే లాంచీ జనంతో నిండిపోయింది. చివరగా పద్మ నేను ఎక్కేం.... కదిలింది.

నీటిమీద ప్రయాణం చేయడం ఇదే మొదటిసారి. ఇద్దరం లాంచీ ముందువైపు నిల్చున్నాం. చప్పుడు చేసుకుంటూ నెమ్మదిగా ముందుకు వెళుతోంది లాంచీ.

'మీరెప్పుడైనా ఇలా ప్రయాణం చేశారా?' చిన్నగా అడిగాను.

'లేదు. ఇదే మొదటిసారి. చాలాబావుంది కదూ?.

తల వూగించాను.

ఆ లాంచీలో కూర్చున్న చాలామంది చూపులు అందమైన పద్మమీదనే వున్నాయి. ఆమె మాత్రం నిశ్చలంగా నీటిలోకి చూస్తోంది.

'ఆమెనీటిలో మధుసూదన్ కోసం వెదుకుతున్నదా?'

'నిజంగా అతన్ని ఎంతగా ప్రేమించిందో?'

గుండెల్లో కలుక్కుమన్నది తలుచుకుంటే—

లోపల కూర్చున్న స్కూలు పిల్లలు ఒక్కొక్కరే

పైకి వస్తున్నారు. వాళ్ల టీచర్ ఊరంత గొంతుతో అరుస్తోంది.

'నీళ్లలో పడి చస్తార్రా.. లోపలకు పదండి. అసలే మీరు కోతులు.

ఎవ్వరూ వినిపించుకోవడం లేదు.

కొండ అంచునే వెళుతోంది లాంచీ.

'ఎంత అందమైన దృశ్యం'! అన్నది పద్మ చుట్టూ వున్న కొండలను, మధ్యలో ఎవరో శాపం పెడితే నిలచిపోయినట్టున్న నీటిని చూస్తూ—

'అవును. ఎప్పుడూ ఇలాగే ప్రయాణం చెయ్యాలని వుంది' అన్నాను.

లాంచీ నడుపుతున్న మనిషి, కిందటేడు ప్రమాదవశాత్తు నీళ్లల్లో పడిన మధుసూదన్ చావు గురించి యాత్రికులకు చెబుతున్నాడు.

'ఈ నీటి మీద ప్రయాణం చూడటానికి ఎంత అందమైనదో అంత ప్రమాదకరమైనది కూడా అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వుంటే. పాపం ఆ బాబుకు ఇలాంటి ప్రయాణాలంటే ఎంతో ఇష్టంట. ఎంత సరదాగానో అందరితో కబుర్లు చెబుతున్నాడు— ఆ ముందు నిలబడి. ఇంతలో ఏమయ్యిందో! ఉన్నట్టుండి వెనక్కు పడిపోయాడు. మా అందరికీ షాక్.. వెంటనే ఎవరైనా దూకటానికి ఇది కాలువ కాదు. చెరువూ కాదు. వంద మనుషుల లోతుంటుంది. చూస్తూ ఊరుకున్నాం. ఆ బాబు హైదరాబాద్ నుండి వచ్చాడట. ఎవరికి దేవుడు ఎక్కడ రాసిపెట్టాడో ఎవరికి తెల్సు.

ఆ మాటలను విననట్టుగానే నటిస్తోంది పద్మ. ఆమె కళ్లలోంచి జారిన నీటిచుక్కలు వంగి చూస్తుండగానే నీటిలో పడ్డాయి.

నిజమే గతాన్ని అతను తవ్వి పోస్తున్నాడు. సరిగ్గా ఏడాది క్రితం జరిగిన విషాద సంఘటనకు ఈ నీళ్లు, కొండలతోపాటు అతను కూడా ఓ ప్రత్యక్ష సాక్షి.

'ఒరేయ్ చెప్పేది మీక్కాదూ! లోపలకు వెళ్లి కూర్చోండిరా. నీళ్లలో పడ్డారంటే చావటమే— ఎందుకు దిక్కులేని చావు చస్తారు? లోపలకుపోండి. మ్యూజియం దగ్గరకు వస్తున్నాంలే.' మరోసారి కొండలు ప్రతిధ్వనించేట్టు అరిచింది ఆ టీచర్.

'అరవకే తల్లీ.. దే ఆర్ చిల్డ్రన్. వాళ్ల మనస్తత్వం అంతే— మనం చెప్పినా వినరు. నీళ్లమీద పోతూ చూడాలని వాళ్లకు మాత్రం అనిపించదూ?' అన్నది ఆమె వయసే వున్న మరో టీచర్ కదులుతున్న జుట్టును వేళ్లతో అణుచుకుంటూ—

'నీకేం ఇప్పుడు కబుర్లు చెబుతావ్.. వీళ్లలో ఏ ఒక్క వెధవైనా నీళ్లలో పడితే వాడి అమ్మానాన్న మనందర్నీ కట్టేసి ఈ నీళ్లలో విసిరిపోతారు.'

## సినిమా పిచ్చోడు



రేపు తమ అభిమాన సినీహీరో సినిమా విడుదయ్యేదుంటూ ఈ రోజే సినిమాహాల్లో నిలబడే మహానుభావులు అనేక మంది మనకు కన్పిస్తుంటారు. కాని అలా ఒక రోజు ముందు థియేటర్‌లో నిలబడక పోయినా వీరందరిని మించి ఓ రికార్డు స్థాపించాడు బ్రిటన్‌కు చెందిన ఓబ్రైన్. ఇతని వయస్సు 72 సంవత్సరాలు. మూకీ సినిమాలను మొదలుకొని టాకీ సినిమాల్లో అత్యాధునికమైన సినిమాల వరకూ 50 సంవత్సరాల కాలంలో 10వేల సినిమాలను చూసి 'గిన్నెస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించుకొన్నాడు.

—బుద్ధా మురళి.

అంతా నవ్వారు ఆ టీచర్ మాటలు వినగానే.

'వేడి వేడి బజ్జీలు—గారెలు' అంటూ ఒకడు వున్నట్టుండి లోపల్నించి ఓ పెద్ద ట్రేలో ఈ తినుబండారాలు పెట్టుకొని వచ్చాడు. పిల్లలంతా వాడి మీదకు ఎగబడ్డారు.

మౌనంగా పద్మ కిందికి చూస్తోంది. ఆమె అంతరంగంలో ప్రస్తుతం తను ప్రాణాధికంగా ప్రేమించిన మధుసూదన్ గురించిన ఆలోచనలు సుడులు తిరుగుతూ వుంటాయేమో?

'ఏమిటి ఆలోచిస్తున్నారు? అంత దీక్షగా నీళ్లలోకి చూస్తున్నారు— మధుసూదన్ కోసమా? చిన్నగా అడిగాను.

'వేళాకోళం చేస్తున్నారా?' తలెత్తి నవ్వుతూ నా కళ్లల్లోకి చూస్తూ అడిగింది.

కాదు. మీ అంతరంగం నాకు తెల్సు. కొన్ని కొన్ని విషయాలు గురించి మనుషులకు క్షుణ్ణంగా తెలిసినా ఏమీ తెలియని వారివలే ప్రవర్తిస్తారు. దానికి ఎవరైనా ఒక్కటే... నాకు అన్పిస్తోంది. మధుసూదన్ ఈ నీళ్లలో ఎక్కడో— ఎక్కడోఏమిటి? తనుపడిపోయిన చోటునే ఇంకా వున్నాడని.. అది సాధ్యమంటారా? అతని మీద మనకు వున్న ప్రేమ, అనురాగంవల్ల అలా అనిపిస్తోంది. ఇది నిజం కాదు అని తెలిసినా మనం ఈ విషయం ఆలోచిస్తాము. నిజానికి ఇది మనం కోరుకునే కోరిక. అతను ఇక్కడ వుంటే బాగుండును. ఇప్పుడు మీరుకూడా ఇలాగే ఆలోచిస్తున్నారనుకుంటాను, అవునా?'

పద్మ మాట్లాడలేదు. మౌనంగా ముందుకు చూస్తున్నది.

'ఆ కనపడే భవనమే మ్యూజియమ్' అన్నాను పద్మతో.

తలవూపి 'మీకు సైకాలజీ తెలుసా?' అనడిగింది నవ్వుతూ—

'తెలీదు'

'బతికించారు'

'ఎందుకు'?

'తెలిస్తే నా ప్రాణం తీసేవాళ్లు. తెలియకుండానే ఇంత సుత్తికొట్టారు. తెలిస్తే ఇక నేనుకూడా మధుసూదన్ లాగే ఈ నీళ్లల్లోకి దూకేదాన్ని మీ సుత్తి భరించలేక'.

పెద్దగా నవ్వాను. 'గుడ్‌జోక్' అంటూ—..


ఇంజన్ బర్‌బర్‌మని చప్పుడు చేస్తోంది. లాంచీ దిశ మారింది. మళ్లీ నది మధ్యకు వచ్చింది.

సూర్యుడి వెలుగులో నీళ్లు వంపులు తిరుగుతూ మెరుస్తున్నాయి.

ఇంజన్ చేస్తున్న చప్పుడుకు భయపడిన చేపలు నీళ్లలో అంతెత్తున ఎగిరి పడుతున్నాయి. అలా పడినప్పుడల్లా పిల్లలు 'అదిగో చేప' అని అరుస్తున్నారు.

మీతోపాటు లాంచీ మనిషిని బతిమలాడి ఎలాగో ఎక్కిన ఓ సాధువు వేషంలో వున్న వాడెవడో ఏవో భక్తి పాటలు పాడుతున్నాడు.

లాంచీ డ్రైవర్ చుట్టూ వున్న వాళ్లకు ఇంకా ఏవో



సంఘటనల గురించి రోజూ వచ్చే యాత్రికుల గురించి చెబుతున్నాడు.

అవతలి కొండకు సమీపంలోకి వస్తున్నాము.

గాలి వేగం పెరిగింది. నా తల వెంట్రుకలు గాలికి చెదిరి పోతున్నాయి. వాలుగా గాలి వీస్తుండటం వల్లనే మా లాంచీ వేగం కూడా పెరిగింది.

'కొంచెం వెనక్కు రండి' మరీ చివరగా వున్నారు' అన్నాను పద్మతో.

'ఫర్వాలేదు. నాకు ప్రాణమంటే భయం ఎక్కువ. జాగ్రత్తగానే వున్నాను' అన్నది నవ్వి—

తల తిప్పి కొండలకేసి దృష్టి సారించాను. కొండల మీది చెట్లు బాగా చిన్నవిగా అగుపడుతున్నాయి. ఎటు చూసినా కొండలే. మనసుకు ఆహ్లాదంగా వుంది.

ప్రశాంతమైన వాతావరణం.

దూరంగా కొండ మరో అంచునుండి ఇద్దరు మనుషులు తెప్పమీద నదిలోకి వెళుతున్నారు. వాళ్లకు ఎలా భయం వెయ్యదో అనిపించింది.

'ఇక్కడే ఏడాదిక్రితం ఆ బాబు ప్రమాదవశాత్తు పడిపోయింది' అన్నాడు లాంచీ డ్రైవర్.

'ఇక్కడేనా' అంతా ఒక్కసారిగా అన్నారు.

తలవూగించాడు.

చప్పుడు కూడా కాలేదు. అంతా ఒక్కసారి అయ్యో.. అయ్యో..' అన్నారు.

ఉలిక్కిపడి తల తిప్పిచూశాను. నా ప్రక్కనే పద్మ లేదు.

'కాలుజారి పడిపోయింది పాపం. ఎవరైనా దూకి బయటకు తీయండి' అరుస్తోంది ఆ టీచర్ ఆదుర్దాగా.

'ఎవరు దూకుతారమ్మా? వంద మనుషుల నిలువులోతు. వాళ్లుకూడా చావాల్సిందే.' లాంచీ డ్రైవర్ అంటున్నాడు.

'షాక్.. నా మెదడు మొద్దుబారి పోయింది. పద్మ మీకు సైకాలజీ తెలుసా?' అని అడిగినపుడు కూడా వూహించ లేక పోయాను. ఏం చెయ్యటానికి తోచ లేదు.

యాత్రికులు రకరకాలుగా మాట్లాడుకుంటూ పద్మ గురించి జాలిపడుతున్నారు. నీళ్లలోకి చూస్తూ కొంతమంది నన్ను ఏవో ప్రశ్నలు అడుగుతున్నారు. కాని నాకు ఇవేమీ పట్టడం లేదు. ఒక్కటే ప్రశ్న నన్ను వేధిస్తోంది.

'ప్రేమ ఇంతటి బలీయమైనదా?'

అంతా ఇంకా నీళ్లల్లోకి చూస్తున్నారు. అందరి మొహాల్లోనూ ఏదో చెప్పలేని భయం. నా గుండెలను ఎవరో నిర్దయగా పిండినట్లనిపించింది. ఇంతటి సాహసానికి ఆమె పూనుకుంటుదనే ఆలోచనే లేదు.

లాంచీ కదులుతూనే వుంది. ఏమీ తెలియనట్టే వున్నాయి నీళ్లు. మరో మనిషి చావుకు ప్రత్యక్షసాక్షులు ఈ అందమైన కొండలు.... అని నాకు అనిపించింది.

రేపటి నుండి వచ్చే యాత్రికులకు పద్మ చావు ప్రమాదవశాత్తు జరిగిందని చెబుతాడనుకుంటాను అసలునిజం తెలియని ఈ లాంచీ నడిపే మనిషి.

**** **** ****

# మీపాపాయి ముద్దుమాటలు

## నవరస సంభాషణమ్

మా చిన్నారి చందన ముద్దు పేరు నానీ. ఉదయం లేస్తూనే హార్లిక్స్ కావాలని అడగటానికి ఆలీత్, ఆలీత్ అని కేకలేస్తుంది. మంచినీళ్ళ కి లూలే, లూలు అని అరుస్తుంది. స్నానానికి లాలపో, లాలపో అని గొడవ చేస్తుంది. నాన్నతో చెబుతానని బెదిరించటానికి నానాటొ చెపుటాన్ అంటుంది. బడి కి బాకీఅని పలక కు పాకా, బలపంకు బాప, పుస్తకం కు పుతటం అంటుంది. బిస్కెట్ కు బీకట్టు అరటి పండు కు ఆటపాం అంటుంది. వస్తాను అనటానికి అట్టాను అంటుంది. చెట్టు కు తుత్తు, పాపిన్స్ కు పాంపు అంటుంది. లేదు అనటానికి దోదు, కరెంట్ కు కాంట్ అంటుంది. మా నానీ పాటలు కూడా పాడ్తుంది.కోకళ్లంకా, కొడవల్లంకా అని పాడటానికి కోలంకా, కవల్లంకా అని పాడ్తుంది.

చందమామ రావే కు టండమాలావే జాబిల్లి రావే కు డాడిల్లి లావే అని పాడ్తుంది. వ్రాస్తూ పోతే ఇలాటివెన్నో.

మురళివేణి,

మోదుగవలస.

## భాగ్యలక్ష్మి మాట భలే భలే

మా పాప భాగ్యలక్ష్మి టాటా చెప్పటానికి తాతా అంటుంది. పాలు కు కాలు, రేడియో కు లేడియో, గౌనుకు ఆను, అత్తయ్యను తత్తయ్య బావను లావ, డ్రాయర్‌ను లాయరు, రిబ్బన్‌ను లిబ్బను, గాజులు కు లాజులు, జాకెట్టును రాకెట్టు, మంచంను కంచం, బొమ్మకు అమ్మ ఇలా ప్రతీమాట వేరుగా మాట్లాడుతుంది.

డి.విజయలక్ష్మి,

పటాన్‌చెరువు.

## యశ్వంత్ వాక్ప్రవంతి

మా బాబు యశ్వంత్ టోపిని పోపి అని నాకు అనటానికి కాకు అని, నీకును కీకు అని ఫ్యాను అనటానికి త్యాను అని పట్వారిని పటటారి అని చెంబుకు పంబు అని, చెల్లికి ఎల్లి, ఎన్.టి.రామారావును ఎన్.టి.లావు అని అంటాడు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.

స్వర్ణా రాఘవరెడ్డి,

చిమనగుంటపల్లి

## విష్ణువాగ్విలాసం

మా బాబు విష్ణు కిరణ్ నాయనమ్మను నామ్మ అని బాబాయ్‌ని బబ్బ అని, అరటిపండును ఆపం అని మమ్మీని అమీ అని బిస్కట్‌ను బిచ్చి అని అక్కను ఆక్క అని అంటాడు. చెప్పాలంటే మరెన్నో ఉన్నాయ్.

ఎన్.నర్సింహస్వామి,

నర్సంపేట.

## కళ్యాణి కమనీయ వాక్కులు

మా కళ్యాణి ముద్దుమాటలు కడుపుబ్బ నవ్విస్తాయి. కారు అనడానికి కావు అంటుంది. పేరు అడిగితే కళ్యాణి అని చెప్పటానికి కళ్యాయి అంటుంది. పిచ్చబ్బాయ్ అనటానికి పుచ్చబ్బాయ్ అని బాబుకు బావు అని పటికబెల్లం కు పత్తి, ఎద్దుకు అట్టు గోలికి గోయి కూర్చో కి తీతి అంటుంది.

కె.విజయలక్ష్మి,

గురజాడ.

Leo వారు సమర్పిస్తున్నారు: శీర్షికలో ప్రచురిస్తున్న ప్రతి రచనకు 'నర్సరీ రైమ్స్' క్యాసెట్ బహుమతిగా ఇవ్వబడును